
ఇంకా ఒక గంట ప్రయాణం-వాచీ చూసుకున్నాను. ప్రీతి, ప్రతాప్ ఇద్దరూ గాఢనిద్రలో ఉన్నారు. సీటు వెనక్కువాలి మళ్ళీ కళ్ళు మూసుకొన్నాను. బస్సు ప్రయాణంలో నాకు సాధారణంగా నిద్రరాదు. కళ్ళుమూసుకొని భావాల ఊసుల్ని కూర్చుకొంటూ ఉంటాను. ఊరు దగ్గర పడుతూ ఉండగా అమ్మా, నాన్న అన్న వదిన, చెల్లెలు, తమ్ముడూ అందరూ గుర్తుకు రాసాగారు.

మనసంతా ఏదో ఆనందం, ఉత్సాహం—ఈసారి చాలా రోజులకి వాళ్ళని కలుసుకోవటం. నిజానికి మా అందరిలోకీ నాది భిన్నమైన మనస్తత్వం. వాళ్ళవన్నీ సనాతన పద్ధతులు. నావన్నీ ఆధునిక భావాలు. ప్రతి విషయానికి నాకు వాళ్ళకూ వాదనే. నేను ఎమ్.ఎస్.సి చదవాలని వాళ్ళు వద్దని. చివరికి పి.జి.కోర్సు పూర్తి చేశాకే పెళ్ళికి ఒప్పుకొన్నాను. డబ్బుతో జీవిత భాగస్వామిని కొనుక్కోటం నాకిష్టంలేదన్నప్పుడు—కట్నం ఇవ్వటం కొనుక్కోవడం కాదని, అది సంప్రదాయమని వాదించేవారు.

కాలం నాకు మైత్రిగా నిలిచిందేమో—ఈ జీవన యాత్రలో రవిచంద్ర రాకతో నా ఆశయాలకు జీవం వచ్చింది. ప్రతాప్ పుట్టిన తర్వాత నాకూ, నా వాళ్ళకు పోరాటంగా—ఉద్యోగావకాశం! 'జీవిత భాగస్వామి' అని పేరుకు మాత్రం పైపూతగా మిగిలిపోతున్న ఈ రోజుల్లో రవిచంద్ర నా అభిప్రాయాలకు బలాన్నిచ్చాడు. అక్కడా నేనే గెలిచాను. నేను వాళ్ళను కలుసుకున్నప్పుడల్లా దేనికోదానికి వాగ్యుద్ధం. అయినా సరే మావాళ్ళని కలుసుకోవాలని ఇంకా జీవితాన్ని పంచుకోవాలని ఏదో ఆత్రుత.

బస్సు ఆగినట్టనిపించింది. గతం తాలూకు ఆలోచనతో కాలం గడచిపోవటం తెలినే లేదు. పిల్లల్ని లేపి సామాన్లు దింపించాను. రిక్షామాట్లాడుకొని ఇంటికి బయలుదేరాను. నేను ఉత్తరం రాయకుండా వస్తే వాళ్ళకది ఎదురుచూడని ఆనందం-నాకది సంతృప్తి. ఈసారి కూడా నేనలా ఊహించాను. రిక్షా చప్పుడు విని నాన్న బయటకు వచ్చి చూసారు. పిల్లల్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని—"అల్లుడుగారు రాలేదేమిటమ్మా" అని అడిగారు. కాని ఎప్పటిలా ఉత్సాహంగా ఇంట్లోకి కేకెయ్యలేదు.

"ఆయన కేంప్ వెళ్తే-సెలవులు కదాని నేను పిల్లల్తో ఇటొచ్చాను—" అంటూనే ఆయన్ని శోధించాను—నాన్న దేనికో బాధపడుతున్నట్టనిపించింది. తర్వాత అందరితో పలకరింపులయ్యాయి. మొత్తం మీద నేనొకటి



# వెలుగులో నీడలు

— జి. గౌతమీదేవి —

గమనించాను—ఇంట్లో పేరుకొని ఉన్న నిశ్శబ్దం అంతకుముందు జరిగిన సంఘర్షణ మిగిల్చిన స్తబ్దత అని!

భోజనాలు ముగించి మామూలు మాటలవీ అయిన తర్వాత అసలు విషయంలోకి వచ్చాను. అమ్మను మెల్లగా కదిపాను.

"ఇదిగో అంతా దీంతోనే వచ్చింది—" చెల్లెలు లత కేసి చూసింది అమ్మ నిరసనగా. "ఏమైంది" విషయం ఏ మాత్రం బోధపడక అడిగాను.

"నేను వద్దన్నా మీ అందరిమాటా విని మీ నాన్న దాన్ని కాలేజీలో చేర్పించారా—ఇదిగో ఇప్పుడు తెలుస్తోంది. కాలేజీ చదువులు ఎందుకు ఆడపిల్లలకు అంటే వినిపించుకోలా-తీరా చూస్తే వ్యవహారం ముదిరిపోయింది. ఎవడో రౌడీ వెధవ గుంపేసుకొని రోజా దానివెంట తిరిగి ఏడిపిస్తున్నాడట. మొన్నటికి మొన్న ప్రక్క వీధిలో మీ మామయ్య ఆ గుంపుని చూసి మీ నాన్నతో అన్నాడట. ఇంకేముంది? ఇలాటి విషయాలు ఆయనకు తెలిస్తే ప్రళయమే-దాన్ని కొట్టారు... తిట్టారు. తండ్రీ కొడుకులు కలిసి కాలేజీకి వెళ్లడం నిలిపించేసారు. అదలా పోనీయ్ ఈ సంగతి మన బంధువులందరికీ తెలిసిపోయింది చూసావ్వా—ఎంత అవమానమని" నిష్ఠూరం వేస్తూ బాధపడిపోయింది అమ్మ.

నేను అమ్మకేం సమాధానం చెప్పలేదు. మౌనంగా లత కేసి చూసాను. బాధను మించిన అవమానాన్ని భరిస్తున్నట్లు బాగా ఏడ్చిన గుర్తులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అసలిది సమస్యేకాదు. ఒక సర్వసాధారణ విషయాన్ని వాళ్ళే సమస్యగా చిత్రించారు. ఒక ఆడపిల్ల తన దారిన తను కాలేజీకి వెళ్తుంటే ఎవరో రౌడీ వెధవలు అల్లరిచేస్తే అది ఆ పిల్ల తప్పా? అందుకు దాన్ని కొట్టాలా-కాలేజీ నిలిపించేయాలా!? ఏం సమాజమిది! ఎప్పుడుమారుతారీ మనుషులు? బంధువులకీ విషయం తెలిసిందని అవమానమట! అసలేం జరిగిందని? లేని నింద దానిమీద వేసి దాన్ని అవమానిస్తున్నారింకా. తన ప్రమేయం లేకుండా జరిగే పనులకు తానెంత వరకు బాధ్యురాలు? ఆ రౌడీలకు బుద్ధి చెప్పాల్సింది పోయి-బుద్ధిలేని ఈ మనుషులు నోరు మెదపలేని పిల్లమీద ప్రతాపాలు చూపిస్తున్నారే... ఇంకా ఎందుకు చట్టాల్నీ ప్రభుత్వాల్నీ దుయ్యబట్టటం? ఏ నేరమూ చెయ్యని పిల్లకు ఏ చట్టమూ విధించని శిక్ష కన్నవాళ్ళేవేసారే—ఎందుకు ఏం పాపం చేసిందని? బూజుపట్టిన సంప్రదాయాలతో సంకుచితపుమనస్తత్వాలతో చీడపట్టిపోయిన ఈ సమాజంలో అందమైన ఆడపిల్లగా పుట్టటమే తను చేసుకొన్న తప్పా? దరిద్రులు... విద్యార్థులట-విద్యార్థులు!! చదువుకొనే ఆడపిల్లల్ని ఏడిపించటం వాళ్ళకు సాధారణ విలాసమైపోగా-తలిదండ్రులకవి తీరని సమస్యలైపోతున్నాయి. ఏం చెప్పాలి వీళ్ళకు? ఏం చెప్పి మార్చాలి? వీళ్ళకేమీ చెప్పక్కర్లేదు. మార్చే ప్రయత్నమూ చెయ్యనవసరం లేదు. అంతో ఇంతో తెలివి, తెగువ ఉన్నవాళ్ళు తమకు చేతనైన విధంగా తమ పనులు తాము చేసుకుపోతే చాలు—నేనొక నిర్ణయానికొచ్చాను.

* * *

ఆ సాయంత్రం మనసుండబట్టలేక అన్నా వదిన, తమ్ముడు అందరూ ఉండగా నాన్నతో ఈ విషయం ఎత్తాను.

"లతను కాలేజీకి వెళ్లొద్దన్నారట." అడిగాను.

"మీ అమ్మ చెప్పలేదా?" నాన్న సమాధానం సూటిగా లేదు.

"దానికదేనంటారా మార్గం?"

"మరేం చేయాలి-అన్తమానం వాళ్ళ కళ్ళబడటం అవకాశం ఇచ్చినట్టే అవుతుంది కదమ్మా—"

"అందుకని మన అవసరాల్ని చంపుకొంటామా? మన అవకాశాన్ని వదులుకొంటామా? ఇద్దరూ కలిసి జరిపే ప్రేమాయణం అయితే మన పిల్లను కట్టడి చేసినా అర్థముంది—కాని తలొంచుకుపోయే పిల్లను బంధిస్తే ఏం లాభం? మనలో ఏ లోపమూ లేనపుడు ఎవరికో భయపడటమేమిటి?

"అయినా ఆ అల్లరి చేసే వాళ్ళకు కాలేజీ ఏమిటి? రోడ్డంతా రంగస్థలమే. అలా అని గడప దాటి బయటకు రాకుండా ఉండలేం కదా. దేనికెంత అవసరమో అంతే చేయడం మనిషికి చాలా శ్రేయస్కరం. అసలేం ప్రమాదం ముంచుకొచ్చిందని అంతలా దిగ్బంధం చేస్తున్నారు? మీ చాదస్తంతో దాని భవిష్యత్‌కు అన్యాయం చేస్తున్నారు నాన్నా"—కాస్త ఘాటుగా అడిగాను.

నాన్న సమాధానం చెప్పకుండానే తమ్ముడందుకొన్నాడు—"మేమేదో అన్యాయం చేశామని నువ్వేం బాధపడాల్సిన అవసరం లేదు అక్కా—చెయ్యాల్సిందే చేసాం. పోకులు చేసుకొని స్టైల్‌గా వెళ్తే ఎవరైనా వెంటవస్తారు.."

> తన వల్ల ఎలాంటి పొరపాటు జరగకపోయినా, పురుషుల అల్లరికి తలవంచడం, అది తన వల్ల శాపంగా భావించడం సగటు వనితలకు అలవాటైపోయింది. సానుభూతి చూపడానికి బదులుగా ఒకోసారి స్త్రీలే పురుషుల దౌర్జన్యాలను సమర్థించడం మరీ దారుణం. ఈ ధోరణిని ప్రతిఘటించడానికి, వనితలలో మానసిక చైతన్యం ఏర్పడడానికి సరైన మార్గాలు అన్వేషించాలి!

నాకు చిర్రెత్తిపోయింది- "ఛీ—సిగ్గులేదట్రా నీ చెల్లి గురించి అలా మాట్లాట్టానికి!—తన తృప్తికోసం తనకు తగ్గ అలంకరణ చేసుకొనేది. చెత్త మనుష్యుల కోసం కాదురా—తానొక మనిషని, ఈ సమాజంలో తనకి గుర్తింపు, కొంతసాన్యత అవసరమని ఒక క్రమమైన పద్ధతిననుసరించటం ప్రతి మనిషికీ అనవాయితీ. మీలాటి చీడపురుగులకోసం ఎవరూ చింపిరి జుత్తేసుకొని మసిపూసుకొని బయటకు రారు. జేబుల్లో దువ్వెనలు పెట్టుకొని రోడ్డు మీద వంకర్లు పోయే వక్రపు బుద్ధులకు ప్రతి సాధారణమైనది వింతగానే కనిపిస్తుందిలే. అసలదేం పోకులు పోతోందని—రంగులు పూసుకొని, స్లీవ్‌లెస్‌లతో మిడీలేసుకొని తిరుగుతోందా? అనాది నుండీ వస్తున్న సాధారణ అలంకరణే దయ్యపు కళ్ళకు పోకులా కనిపిస్తుంది కదూ? అయినా అలంకరణ అనేది తన స్వంత విషయం. ఎదుటి వ్యక్తి ఎన్ని రంగులు పూసుకుంటే ఏం... ఎన్ని అవతారాలు వడితే ఏం... చూసే కంటికి బుద్ధి మంచిదయితే అవన్నీ అనవసరమైనవే. ఆడపిల్ల చేసుకొనే అలంకరణ, వేసుకొనే దుస్తులు కూడా మీ అనుగ్రహం, ఆగ్రహానికీ అనుకొంటున్నారా... ఇంత అన్నలున్నారే ఆ రౌడీలకు నాలుగు ఘాటుగా తగిలిస్తే మళ్లీ వస్తారా? చెయ్యాల్సింది చెయ్యకుండా సొంత చెల్లెలి మీదే అభాండాలు చేస్తున్నారే—ఎందుకురా స్త్రీ అంటే అంత చులకన?—పనిచెయ్యకుండా పనికిరాని మాటలు పలకటం" నా వశం తప్పి ఆవేశం పొంగిపొర్లింది.

నా మాటలు వాళ్ళ అభిప్రాయాలను మార్చలేకపోయినా అందులోని సత్యం వాళ్ళను కొంచెం సేపు మాట్లాడనియ్యలేదు.

కాసేపటికి నెమ్మదిగా నాన్న అన్నారు—"వాడన్న దాంట్లో అంతో ఇంతో నిజం లేకపోలేదమ్మా—ఆడపిల్లలు అణకువగా ఉండాలి..." కొంచెం మెత్తగా వాడి ధోరణిలోనే మాట్లాడసాగారు.

వాళ్ళ నీరసవాదానికి నాకు నిస్సత్తువ పెరిగిపోతోంది. నాన్నా మాట్లాడుతుండగా మధ్యలోనే అందుకొన్నాను—"ఎంతసేపూ ఆడదాని అణకువ మీదేనా ధ్యాస?—మన జాగ్రత్తలో మనముండాల్సిన మాట నిజమే. కాని, తన ప్రమేయం లేకుండా ఎవరో దాన్నేడిపిస్తే, వాళ్ళమీద చర్య తీసుకోక దాన్ని దండించటం వల్ల ఒరిగేదేమిటి? ఈ రోజు కాలేజీ నిలిపించేసారు. రేపది పనిమీద బజారు కెళ్తుంది. అప్పుడు వాళ్ళకంటపడదా?—పరిస్థితులకు ఎదురీదాలే కానీ భయపడి దాక్కుంటే బ్రతుకేముంది? అసలు జరిగిందేమిటి—మీరు చేస్తున్నదేమిటి? మీరెలా మాట్లాడుతున్నారంటే ఆడపిల్ల అలంకరణ చేసుకోటం తప్పు. రోడ్డుమీద తలెత్తి నడవటం తప్పు. అలా చేస్తే అల్లరి చెయ్యటం మగవాళ్ళ హక్కు. తనకు సంబంధించిన విషయాల్లో ఇతరుల చర్యల్ని ఊహించి నడుచుకోవాల్సిన అవసరం స్వతంత్రదేశంలో ఒక మనిషికి కలగటం ఎంత దౌర్భాగ్యం! అసలు ఏ తప్పు చెయ్యని మనమెందుకు భయపడాలి?—మనకు మనమే చెరలో ఎందుకుండాలి?"

నేనిలా మాట్లాడితే వాళ్లు వాదించలేరు. అందుకే వ్యవహారాన్ని ఇంకా పొడిగించి వాళ్ళ మనసుల్ని తృప్తిపరచే పిచ్చి ప్రయత్నం చెయ్యకుండానే అనుకొన్న విషయం చెప్పేసాను.

"నాన్నా—నా మీద గురి ఉన్నా మీ కూతురి ప్రవర్తన మీద మీకే మాత్రం నమ్మకం ఉన్నా—లతను నాతో పంపండి. నే చదివిస్తాను. ఏ సంగతీ నేను వెళ్లేలోగా చెప్పండి" అని చెప్పేసి నేను గదిలోకి వెళ్లిపోయాను.

ఏమనుకున్నారో ఏమో లతను మా ఊళ్లో చదివించటానికి ఒప్పుకున్నారు. బహుశా ఆయన ఉద్దేశ్యం—వాళ్ళకు దూరంగా కూతురు వెళ్ళగలుగుతోందని కావొచ్చు. కాని నా ఉద్దేశం అది కాదు. దాని వెంట పడుతున్న ఆ అల్లరి పిల్లలకు బుద్ధి చెప్పలేక, వాళ్ళ అల్లరి నుండి లతను తప్పించలేక-భయపడి లతను నాతో తీసుపోవటంలేదు—స్పష్టమైన వెలుగులో కూడా చీకటి కోణాన్ని వెలికి తీసే మనుషులకు దూరంగా తీసుకుపోతున్నాను. ఇలాటి సమాజం ఇక్కడ, అక్కడ—ఎక్కడైనా ఉంటుంది. కాని మన చుట్టూ మన ఆప్తులే అలాటి సమాజాన్ని ఏర్పరుస్తుంటే ఎదగాల్సిన వ్యక్తికి భవిష్యత్తు శూన్యం అవుతుంది. అలా కాకుండా నా చెల్లెల్ని చెదలు పట్టిన ఈ సమాజానికి దీటుగా తనకంటూ ఒక వ్యక్తిత్వాన్ని తనవి అంటూ కొన్ని అభిప్రాయాల్ని ఏర్పరచుకోగల సామర్థ్యానికి శ్రీకారం చుట్టాను. ఈ స్వతంత్రదేశంలో ఒక వ్యక్తిని కట్టుబాట్లు అనే శృంఖలాల నుండి విముక్తి కలిగించి నాకందుబాటులో ఉన్న కనీసపు విధిని నిర్వర్తించబోతున్నాననే తృప్తితో తిరుగు ప్రయాణమయ్యాను. □